క్లుప్తంగా

వందశాతం ఇంటిపన్ను వసూలు చేయాలి



పల్లె ప్రకృతివనం పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామ పంచాయతీని బుధవారం మంథని డివిజనల్ పంచాయతీ అధికారి సతీశ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 100శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని, గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా ఇతర అంశాలపై కార్యదర్శికి పలు సూచనలు చేశారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సంతోష్, కారోబార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూసేకరణ నోటిఫికేషన్ రద్దుచేయాలి

రామగిరి: మేడిపల్లి శివారులో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేయాలని బుధవారం రత్నాపూర్ గ్రామస్తులు డిప్యూటీ తహసీల్దార్ యజ్ఞంబట్ల మానసకు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ జారీ చేసిన నోటీసులో 60రోజుల్లో రైతులు అభ్యంతరాలు తెలపాలని సూచించారు. కాగా రైతులు భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేరన్నారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు భూములు ఇవ్వబోమని వెంటనే నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ రద్దుపై ఎలాంటి సమాచారం తెలపకపోతే రైతులతో కలిసి నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రామస్తులు కొండ లక్ష్మణ్, దర్ముల రాజసంపత్, కృష్ణ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాకలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవం వేడుకల్లో భాగంగా ఈనెల 5 నుంచి 11వరకు ఆలయంలో సప్తాహ (అఖండ భజన), సప్తాహయాగం, హోమం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు అరవింద్‌చార్యులు, ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. 10న సాయంత్రం స్వామివారి పల్లకి సేవ ఉంటుందన్నారు. 11న సాయంత్రం 6గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



సంబరాల్లో బీజేపీ నాయకులు

జూలపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి ఘన విజయం సాధించడంపై హర్ష వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. సంబరాల్లో గుడిపాటి సంతోష్‌రెడ్డి, ఆవుల రాజు, అజయ్, వజ్రారెడ్డి, సతీశ్‌రెడ్డి, శ్రీనివాస్, మహేందర్ పాల్గొన్నారు.

మూడో డివిజన్‌లో వీధిదీపాల ఏర్పాటు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్‌లో బుధవారం వీధి దీపాలు ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ మూడో డివిజన్ అధ్యక్షుడు ఈదునూరి మల్లేశ్ ఆధ్వర్యంలో అన్నపూర్ణకాలనీ మెయిన్ రోడ్‌లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది వీధి దీపాలు ఏర్పాటు చేశారు. మల్లేశ్ మాట్లాడుతూ రహదారుల వీధిదీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో రాకపోకలకు ఇబ్బంది ఉందని, ప్రమాదాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో లైట్లు ఏర్పాట్లు చేశారని తెలిపారు.

బ్రహ్మాచార్యులకు భూగర్భవాస్తు సామ్రాట్ బిరుదు

ధర్మారం: మండల కేంద్రానికి చెందిన సీపెల్లి బ్రహ్మాచార్యులకు తమిళనాడుకు చెందిన వేదిక్ ఫ్రిక్వల్ ఆస్ట్రాలజీ వారు భూగర్భవాస్తు సామ్రాట్ బిరుదుతో సత్కరించారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన వేదిక్ ఫ్రిక్వల్ ఆస్ట్రాలజీ అధికారులు బ్రహ్మాచార్యులకు బిరుదు అందించినట్లు ఆయన తెలిపారు.

ఇంటర్ మొదటిరోజు ప్రశాంతం



సుల్తానాబాద్: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



జూలపల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



కమాన్‌పూర్: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ నక్క ప్రసాద్



జ్యోతినగర్: సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రంలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు



సుల్తానాబాద్: హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 351 మంది విద్యార్థులకు 341 మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ రాంచందర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై శ్రవణ్ కుమార్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముత్తారం: ముత్తారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 149 మంది విద్యార్థులకు ఆరుగురు గైర్హాజరయ్యారు.

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, జూనియర్ కాలేజీలోని పరీక్ష కేంద్రంలో 491మందికి 18 మంది గైర్హాజరయ్యారు. రామగుండం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్ నేతృత్వంలో బందోబస్తు చేపట్టారు.

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 11 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా 145 మంది పరీక్షలు రాసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ బాలరాజు తెలిపారు. ఎస్సై వెంకటేశ్ బందోబస్తు నిర్వహించారు.

ధర్మారం: మండలం కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు సాధన జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో మండలంలోని ఆరు కళాశాలల నుంచి 550మందికి 24మంది గైర్హాజరయ్యారు.

ఓదెల: ఓదెల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 143 విద్యార్థులు తెలుగు పరీక్షకు హాజరయ్యారు. పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కమాన్‌పూర్: మండలంలోని గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 73 మంది విద్యార్థులకు 72మంది పరీక్షకు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని గోదావరిఖని టూటౌన్ సీఐ నక్క ప్రసాద్, కమాన్‌పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్, జిల్లా పరీక్షల అధికారి సలీం పరిశీలించారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు తెలుకుంట కస్తూర్బా బాలికల విద్యాలయం, పెద్దాపూర్‌లోని ఆదర్శ విద్యాలయంలో 278 మందికి 9మంది గైర్హాజరైనట్లు పరీక్షా కేంద్రం ఇన్‌చార్జి, ప్రిన్సిపాల్ విశ్వప్రసాద్ తెలిపారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

పాలకుర్తి: ప్రభుత్వం కార్మికుల కనీస వేతనాల జీవోను సవరించి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అన్నిరంగాల కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలయ్యేలా చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 6న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లాలో వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు, పంచాయతీ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి కార్మికులకు పంపిణీ చేశారు. సీఐటీయూ నాయకులు అశోక్, నవీన్, బూడిద రామస్వామి, స్వరూప, రామలక్ష్మి, స్వామి, రఫీక్ పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

కాల్వశ్రీరాంపూర్: వివిధ ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు డిమాండ్ చేశారు. 6న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టే ఆందోళన కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ కాల్వశ్రీరాంపూర్ అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన కరపత్రాలు ఆవిష్కరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మంద రాజేందర్, మండల నాయకులు లక్ష్మణ్, రాజయ్య, మధునయ్య, కొమురయ్య, అంజయ్య, లక్ష్మి, అనసూయ, మహేశ్ పాల్గొన్నారు.



పాలకుర్తి: కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

సుల్తానాబాద్: మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి ముత్యంరావు కోరారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్‌కు వినతిపత్రం అందజేశారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ యూనియన్ నాయకులు న్యాతరి రమేశ్, మల్లేశ్, సురేశ్, లక్ష్మణ్, రామ్మూర్తి, లక్ష్మి, శ్రీనివాస్, మధు, నర్సింగం పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఈడీకి సన్మానం



సన్మానిస్తున్న ఎన్టీపీసీ సభ్యుడు బాబర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం-తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన చందన్ కుమార్ సామంతను ఘనంగా సన్మానించారు. బుధవారం ప్రాజెక్టు పరిపాలనా భవనంలో ఐఎన్టీయూసీ జాతీయ కార్యదర్శి, ఎన్టీపీసీ ఎన్బీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా, ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ (ఐఎన్టీయూసీ) వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి రాజేశ్వర్ పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో ఏజీఎం బిజయ్‌కుమార్ సిగ్దర్‌తో పాటు ఉద్యోగ గుర్తింపు సంఘం నాయకులు బండారి కనకయ్య, నేరెళ్ల రమేశ్, అధికారులు పాల్గొన్నారు.

ఓసీపీ-1 సందర్శన

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-3 పరిధిలోని ఓసీపీ-1 ప్రాజెక్టును బుధవారం ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు సందర్శించారు. వ్యూ పాయింట్ ద్వారా క్వారీలో నడుస్తున్న పనులను పరిశీలించారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు తీసుకుంటున్న భద్రతా చర్యలు, ప్రణాళికల వివరాలను ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు డైరెక్టర్‌కు వివరించారు. ఎస్‌వోటూ జీఎం రఘుపతి, మేనేజర్ ఉదయ్ హరిజన్ ఉన్నారు.

నేడు ఆర్జీ-1లో మహిళలకు ఆటల పోటీలు

గోదావరిఖని: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆర్జీ-1 ఏరియాలో మహిళలకు పలు పోటీలు నిర్వహించనున్నట్లు పర్సనల్ డీజీఎం కిరణ్‌బాబు తెలిపారు. ఉదయం 10.30గంటలకు గోదావరి కళా ప్రాంగణంలో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 3గంటలకు సేవా సభ్యులు, సింగరేణి ఉద్యోగుల గృహిణులు, యువతులు, పారిశ్రామిక ప్రాంత మహిళలకు జీఎం కాలనీ గ్రౌండ్‌లో ఆటల పోటీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రధాన వేడుకలు ఈనెల 8న ఆర్‌సీవోఏ క్లబ్‌లో ఉదయం 10గంటల నుంచి ఉంటాయన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మోడల్ స్కూల్‌లో వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల మోడల్ స్కూల్లో బుధవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి ఏఎంవోపీఎం షేక్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. తహసీల్దార్ జగదీశ్, ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆహుతులను అలరించాయి. ప్రిన్సిపాల్ సత్యనారయణ, పీఈటీ పోచయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దయ్య దేవుడి విగ్రహ ప్రతిష్ఠాపన



ఎలిగేడు: మండలంలోని లాలపల్లి గంగుల గుట్ట వద్ద బుధవారం పెద్దయ్యదేవుడి విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దయ్య దేవుడి విగ్రహం ప్రతిష్ఠించారు. మాజీ సర్పంచ్ ఎల్లవ్వరాజేశ్వర్‌రెడ్డి, రాజిరెడ్డి, డిల్లేశ్వర్ రెడ్డి, లస్మయ్య, గంగయ్య, కొమురయ్య, భూమయ్య, రామయ్య, మల్లారెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల విశ్వేశ్వరస్వామి ఆలయ కమిటీ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కాసర్ల మల్లారెడ్డి, వైస్ చైర్మన్ బసవత్తుల జ్ఞానేంద్రాచారి, కోశాధికారిగా ఉప్పుల రమేశ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఆలయ నిర్మాణ దాత ఆకినపెల్లి ప్రభావతి, శాశ్వత సభ్యులు మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, మాజీ సర్పంచ్ జక్కె రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

మంథని: అక్రమంగా డబ్బులు సంపాదించాలనే అత్యాసతో ప్రజల్ని మభ్యపెడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాలకు చెందిన చంద్రశేఖరరావు, మండమర్రికి చెందిన వెంకటస్వామి తమకు తెలిసిన వ్యక్తికి రిజర్వు బ్యాంకు అకౌంట్‌లో రూ.38వేల కోట్లు ఫ్రీజ్ అయి ఉన్నాయని, లక్ష రూపాయలు ట్యాక్స్ కడితే రిలీజ్ అవుతాయని చెప్పారు. లక్ష రూపాయలు ఇస్తే కోటి రూపాయలు ఇస్తానని మధునయ్య అనే వ్యక్తితో సంప్రదింపులు జరుపుతుండగా పట్టుకొని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇలా ఎవరైనా డబ్బు ఆశ చూపించి మభ్యపెడితే తమకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

సుల్తానాబాద్: గ్రామాలు, పట్టణాల్లో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో డబ్బులు వసూలు చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు అన్నారు. మండలంలోని దుబ్బపల్లిలో మధ్య దళారులు ఇళ్లు ఇప్పిస్తామని, తాము చెప్పేనే ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఇంటి యజమానుల వద్దకు వెళ్లి చెప్తున్నారని కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లాయని ఆయన తెలిపారు. స్థలం ఉండి ఇల్లు నిర్మాణం చేసుకుంటాం అనుకునే వారికి అనుమతి ఉన్నవారికి ఇల్లు నిర్మాణం చేస్తామని మార్చి చివరిలో మొదటి బిల్లు అందజేస్తామని పేర్కొన్నారు. దళారుల మాట నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యాలయానికి వచ్చి నేరుగా తెలుసుకోవాలన్నారు.

600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

రామగిరి: మండలంలోని బేగంపేట గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 600 లీటర్ల బెల్లం పానకాన్ని ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. ఎక్సైజ్ ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం రామగిరి మండలం బేగంపేట అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ చేస్తున్నారన్న సమాచారం మేరకు స్థావరాలపై దాడులు నిర్వహించారు. దాడుల్లో పట్టుబడ్డ 600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు వారు పేర్కొన్నారు. సిబ్బంది నిరంజన్, రఘు, రవి ఉన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఓదెల: మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనగర్తి గ్రామ శివారులో పేకాట స్థావరంపై బుధవారం ఎస్సై దికొండ రమేశ్ ఆధ్వర్యంలో దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కనగర్తి గ్రామశివారులో పేకాట ఆడుతున్నారన్న అందిచన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నగదు రూ.4,400 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వీడ్కోలు సమావేశం



ఉపాధ్యాయులతో పదో తరగతి విద్యార్థులు

ధర్మారం: మండలంలోని కటికనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. 2024-25లో పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులకు తోటి విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులు చేసిన నృత్యాలు గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయుడు మల్లేశం, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నర్సయ్య, సునీత, విజయ్‌కుమార్, జహంగీర్, సరిత, రోజా, పీఈటీ కుమార్, సీఆర్‌పీ బట్టు కుమారస్వామి పాల్గొన్నారు.



కమాన్‌పూర్: మండలంలోని గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సింగరేణి సంస్థ నిధులతో నిర్మించిన టాయిలెట్స్ నిర్మాణ పనులు అసంపూర్తి పనులతో నిలిచిపోయాయి. కళాశాల ఆవరణలో విద్యార్థులు, సిబ్బంది కోసం రెండు టాయిలెట్స్ నిర్మాణం కోసం సింగరేణి సంస్థ నిధులు మంజూరు చేసింది. సదరు కాంట్రాక్టర్ నిర్మాణ పనులు నిలిపివేశాడు. పనులు పూర్తి చేయాలని విద్యార్థులు, సిబ్బంది కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న డైరెక్టర్ సత్యనారాయణరావు

గోదావరిఖని: దుర్గామాత ఆలయంలో సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవర్‌హౌస్‌లోని సివిల్ విభాగం వద్ద ఉన్న దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన 22వ వార్షిక వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. డైరెక్టర్ వెంట ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్, అధికారులు దాసరి వెంకటేశ్వర్‌రావు, కిరణ్ బాబు, శివనారాయణ, జితేందర్‌సింగ్, కిరణ్‌రాజ్‌కుమార్, వరప్రసాద్, వీరారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భద్రతతో ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి



మాట్లాడుతున్న ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు

రామగిరి: నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలని ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆర్జీ-3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు, ఏరియాలోని వివిధ గనుల విభాగాధిపతులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన ఓబీ, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించే దిశగా ఎప్పటికప్పుడు కార్యాచరణ సిద్ధం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. మార్కెట్‌లో ఉన్న పరిస్థితులను ఉద్యోగులకు అవగాహన కల్పిస్తూ లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలన్నారు. బొగ్గు ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం కలగకుండా చూసుకోవాలని, భద్రతతో కూడిన ఉత్పత్తి, రవాణా సాధించడానికి ప్రతీఒక్కరు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం ముగింపు దశలో ఉన్నామని, ఉద్యోగులందరూ బాధ్యతగా విధులు నిర్వహించి లక్ష్యాలను సాధించాలన్నారు. ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్‌బాబు, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, విభాగాధిపతులు రాజారెడ్డి, రాజేంద్రకుమార్, బి.సుదర్శనం, జనార్దన్‌రెడ్డి, ఐలయ్య, ఉదయ్ హరిజన్, షబ్బీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు



పోటీల్లో పాల్గొన్న ఉద్యోగులు

రామగిరి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలోని ఆయా గనులు, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో జీఎం కార్యాలయంలో ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మార్చి 8న బహుమతుల ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్ గుర్రం శ్రీహరి, నిర్వాహకులు నాగరాజు, సదయ్య పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సేవా అధ్యక్షురాలు వనజ

గోదావరిఖని: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆర్జీ-2 సేవా అధ్యక్షురాలు వనజ పిలుపునిచ్చారు. స్థానిక సీఈఆర్ క్లబ్‌లో బుధవారం సేవా మహిళలతో సమావేశం నిర్వహించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 7న ఎస్‌సీవోఏ క్లబ్‌లో సభ్యులకు ఆటల పోటీలు, అదేరోజు సాయంత్రం 4గంటలకు జీఎం ఆఫీసులో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 8న సీఈఆర్ క్లబ్‌లో మహిళలకు ఆటల పోటీలు ఏర్పాటు చేశామన్నారు. 12న సీఈఆర్ క్లబ్‌లో మహిళా దినోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. డీవైపీఎం శ్యామ్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్ రెడ్డి, ఎస్‌సీవోఏ క్లబ్ సెక్రటరీ కల్పన, సేవాసభ్యులు సృజన, కోఆర్డినేటర్ దేవారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవం

రామగుండం: అంతర్గాం మండలం ముర్మూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ముందస్తు మహిళా దినోత్సవం బుధవారం నిర్వహించారు. వేడుకల్లో పీడీ వేణు గోపాల్‌రావు, తహసీల్దార్ రవీందర్, అనిల్, సీడీపీవో అలేఖ్య పటేల్ పాల్గొని గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

విజేతలకు బహుమతి ప్రదానం

కమాన్‌పూర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని రొంపికుంటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా మహిళలకు ఆటల పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బుధవారం బహుమతులు అందజేశారు. జ్యోతి, వనజారాణి, లక్ష్మి, రాజమణి, రజియా, రమ, శారద పాల్గొన్నారు.